క్లుప్తంగా

క్షేత్ర సందర్శనతో విజ్ఞానం


పరిశ్రమను పరిశీలిస్తున్న విద్యార్థులు

మాకవరపాలెం: క్షేత్ర సందర్శనతో విజ్ఞానం పెంపొందుతుందని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం కె.రాము అన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా ఈ గ్రామంలో ఉన్న శానిటరీ ప్యాడ్స్ తయారీ పరిశ్రమకు శుక్రవారం విద్యార్థులతో వెళ్లారు. ఈ సందర్భంగా ఇక్కడ ప్యాడ్స్ తయారీ విధానం, ముడి సరుకు, ఉపాధి, తదితర అంశాలను పరిశ్రమ యజమాని పవన్‌కుమార్ వివరించారు. అనంతరం హెచ్ఎం రాము మాట్లాడుతూ పాఠ్యాంశాల్లో బోధనతోపాటు క్షేత్ర సందర్శనలతో విద్యార్థులకు మరింత జ్ఞానం పెరుగుతుందన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ప్రత్యేక తరగతులు


ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

రోలుగుంట: వచ్చే నెల 8న జరిగే ఎన్ఎంఎంఎస్ పరీక్షకు జె.నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి హాజరుకానున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు హెచ్ఎం రమేష్ కుమార్ తెలిపారు. పాఠశాల బోధనా సమయానికి ముందు, పాఠశాల విడిచిపెట్టిన తరువాత గంట సేపు చొప్పున ఈ తరగతులను పాఠశాలకు చెందిన సబ్జెక్టు టీచర్లు కోటేశ్వరరావు, శ్రీనివాసరావు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అవసరమైన మెటీరియల్‌ను గణిత టీచర్ కోటేశ్వరరావు తన సొంత ఖర్చులతో విద్యార్థులకు సమకూర్చారు.

స్కూల్ ఆవరణలో వివాహాది కార్యక్రమాలకు అనుమతి లేదు

రోలుగుంట: పాఠశాల ఆవరణలో వివాహాది కార్యక్రమాల నిర్వహణకు అనుమతి లేదని మండల విద్యాశాఖాధికారి పి.జగ్గారావు తెలిపారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. పాఠశాల ఆవరణలో వివాహాలు, రాజకీయ సమావేశాలు, విద్యాశాఖకు సంబంధం లేని కార్యక్రమాలు నిర్వహిస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గ్రామసభలతో రెవెన్యూ సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న మండల సర్వేయర్ రామచంద్రమూర్తి

కె.కోటపాడు : గ్రామసభల ద్వారా రెవెన్యూ సమస్యలు పరిష్కారం కానున్నట్టు మండల సర్వేయర్ రామచంద్రమూర్తి తెలిపారు. ఎ.భీమవరంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. 25 మంది నుంచి అర్జీలు స్వీకరించినట్టు చెప్పారు. ఈ అర్జీలను 15 రోజుల్లోగా పరిష్కరించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తర్రా సన్యాసమ్మ, గ్రామ సర్వేయర్ విజయ, జగదీష్ పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి


విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

నర్సీపట్నం: సీపీఎం నాయకులు ఇంటింటికీ వెళ్లి విరాళాల సేకరించారు. డిసెంబర్ 20 నుంచి 21 వరకు నిర్వహించే సీపీఎం జిల్లా 24వ మహాసభలను విజయవంతం కోరారు. మహాసభలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించినట్టు చెప్పారు. విరాళాల సేకరణలో సీపీఎం నాయకులు చిరంజీవి, ఎల్.గౌరి, కె.వి.సూర్యప్రభ, నాగిరెడ్డి, సత్యనారాయణ, దేముడునాయుడు పాల్గొన్నారు.

అంతంత ‘మాత్ర’ం

వాతావరణంలో మార్పుల కారణంగా జ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రతి గ్రామంలో జ్వర పీడితులున్నారు. వైద్య కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వెళితే కొన్ని మాత్రలు తప్పితే అత్యవసర మందులు లభించడం లేదు. ఇండెంట్ పెట్టి నెలలు గడుస్తున్నా సరఫరా కావడం లేదు.

- పీహెచ్‌సీల్లో మందుల కొరత
- నాలుగు నెలలుగా సరఫరా కాని టైఫాయిడ్ కిట్లు
- బీపీ, సుగర్ మాత్రలూ అందుబాటులో లేక అవస్థలు
- ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్న రోగులు


కేజే పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


కేజేపురం పీహెచ్‌సీలో ప్రస్తుతం ఉన్న మందులు


కింతలి పీహెచ్‌సీలో ఓపీ వద్ద పేషెంట్లు

మాడుగుల రూరల్: మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత కారణంగా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు నెలల నుంచి పీహెచ్‌సీల్లో టైఫాయిడ్ కిట్ల కొరత వేధిస్తోంది. గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ తదితర వ్యాధుల బారినపడే వారు ఆర్థిక భారమైనా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవలసి వస్తోంది. ఇతర మందులు, ఇంజక్షన్ల కొరత కూడా ఏర్పడింది. యాంటీబయాటిక్ మాత్రలు, టైఫాయిడ్ నివారణకు వినియోగించే మాత్రల పాటు డ్రైక్లో ఇంజక్షన్లు మూడు నెలల నుంచి కేజే పురం పీహెచ్‌సీలో అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు ఎవిల్, డెరిఫిలిన్ వంటి ఇంజక్షన్లు కూడా అందుబాటులో లేవు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు అందజేయవలసిన 142 రకాల మందులు, ఇంజక్షన్లలో 50 శాతం రకాల మందులు కూడా అందుబాటులో లేవు. శీతాకాలంలో మంచు, చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల చాలా మంది ఆయాసం తదితర సమస్యలతో బాధపడుతుంటారు. ఆయాసం నివారణకు గాను డెరిఫిలిన్ ఇంజక్షన్ వాడుతుంటారు. ప్రస్తుతం పీహెచ్‌సీలో ఈ ఇంజక్షన్ కొరత ఎక్కువగా ఉందని పీహెచ్‌సీకి వచ్చే రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని ప్రైవేటు మందుల షాపుల్లో కొనుగోలు చేయాలంటే వ్యయంతో కూడిన పని అని వారు తెలిపారు. కేజే పురం పీహెచ్‌సీ పరిధిలో 10 సచివాలయాలకు చెందిన 36 గ్రామాలున్నాయి. 29,065 మంది జనాభా ఉన్నారు.

- కింతలి పీహెచ్‌సీలో కూడా ఇంజక్షన్లు, మందుల కొరత ఎక్కువగా ఉంది. ఈ పీహెచ్‌సీ పరిధిలో 9 సచివాలయాలు ఉన్నాయి. 28,950 మంది జనాభా ఉన్నారు. గతంలో పీహెచ్‌సీలకు ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా కేంద్రం నుంచి మందులు సరఫరా చేసేవారు. ప్రస్తుతం ప్రతి మూడు నెలలకు ఒకసారి హెచ్‌డీఎఫ్‌సీ నిధుల నుంచి కొనుగోలు చేయాలి. బీపీ, సుగర్, మాత్రలు కూడా పీహెచ్‌సీల్లో అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడింది.

పేద రోగులకు ఇబ్బందులు



పీహెచ్‌సీల్లో మందుల కొరత ఎక్కువగా ఉంది. దీంతో పేద రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యమైన ఇంజక్షన్లు లేక మందుల షాపుల్లో కొనుగోలు చేయవలసి వస్తోంది. వెంటనే మందులు సరఫరా చేయాలి

– సలాది అచ్చిమినాయుడు, గాదిరాయి, మాడుగుల మండలం

ఐదు నెలలుగా సరఫరా కాలేదు



పీహెచ్‌సీలో మందులు, ఇంజక్షన్ల కొరత ఉంది. టైఫాయిడ్ కిట్లు గత ఐదు నెలల నుంచి అందుబాటులో లేవు. జిల్లాలో ఏ పీహెచ్‌సీలో కూడా కిట్లు లేవు. జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపించాం.

– డాక్టర్ ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదుపాత్రుడు, ప్రధాన వైద్యాధికారి, కేజే పురం పీహెచ్‌సీ

నేడు గౌరీ పరమేశ్వరుల నిమజ్జనోత్సవం

మాడుగుల రూరల్: మండలంలోని కేజే పురంలో శనివారం గౌరీ పరమేశ్వరుల నిమజ్జనోత్సవం నిర్వహించనున్నారు. ఈ నెల5వ తేదీన స్థానిక శాలిపేట చావిడిలో గౌరీ పరమేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం నిమజ్జనోత్సవం, అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పట్టా భూముల ఆన్‌లైన్‌కు వినతి


మాడుగులలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మాడుగుల: పట్టా భూములను ఆన్‌లైన్ చేయాలంటూ సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్నతో పాటు ఆ సంఘ సభ్యులు.. రైతుల తరఫున తహసీల్దార్ రమాదేవికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో వొమ్మలి ఉరలోవ కొండ చుట్టూ ఉన్న వీజేపురం, ఎం.కృష్ణాపురం, వొమ్మలి, రావికమతం మండలం కొమిర తదితర గ్రామాల్లో సుమారు 450 మంది గిరిజనులు, దళిత పేదలకు భూమి పంపిణీ చేశారని తెలిపారు. అయితే ఆ భూములను నేటికీ ఆన్‌లైన్ చేయలేదని చెప్పారు. ఆన్‌లైన్ చేసి పేదలను ఆదుకోవాలని తహసీల్దార్‌ను కోరినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి, సభ్యురాలు కె. భవాని తదితరులు పాల్గొన్నారు.

నూకరాజు మృతి తీరని లోటు



నూకరాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చింతకాయల సన్యాసిపాత్రుడు

నాతవరం: రాజకీయ విలువలు కలిగిన వైఎస్సార్‌సీపీ మాజీ మండల అధ్యక్షుడు శెట్టి నూకరాజు(65) మృతి పార్టీకి తీరని లోటని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. గురువారం రాత్రి ఆయన మరణించారు. స్వగ్రామం గుమ్మడిగొండలో నూకరాజు మృతదేహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత, నర్సీపట్నం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప వేర్వేరుగా మాట్లాడుతూ నూకరాజు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా, వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా విశేష సేవలందించారన్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీ పైల సునీల్ వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచులు ఎంపీటీసీ సభ్యులతో పాటు బీజేపీ నాయకుడు లాలం వెంకటరమణారావు, టీడీపీ సీనియర్ నాయకుడు సుర్ల వెంకటరమణ, వివిధ శాఖలు అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

జాబ్ కార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం


సమావేశంలో మాట్లాడుతున్న టెక్నికల్ అసిస్టెంట్ ఎర్రినాయుడు

చీడికాడ: నూతన జాబ్‌కార్డులు అవసరమైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎన్ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ కె.ఎర్రినాయుడు తెలిపారు. అర్జునగిరి సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆయన మాట్లాడారు. చనిపోయినవారి పేర్లను తొలగిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో సర్పంచ్ బి.రమాదేవి, ఎంపీటీసీ పి.అమ్మతల్లినాయుడు, పంచాయతీ కార్యదర్శి తలుపులమ్మ, వీఆర్‌పీ సంతోష్ పాల్గొన్నారు.

రాయితీపై అపరాల విత్తనాల పంపిణీ


అపరాల విత్తనాల పంపిణీని ప్రారంభిస్తున్న సర్పంచ్ కళావతి, ఏవో వాసుదేవరావు


జోగంపేటలో రైతులకు విత్తనాలు అందిస్తున్న సిబ్బంది

మాడుగుల: రబీ సీజన్‌కు సంబంధించి రాయితీపై అపరాలు విత్తనాలు పంపిణీ చేస్తున్నట్టు వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు.శుక్రవారం అపరాల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ కళావతితో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. మండలంలో 65 క్వింటాళ్ల మినుములు, 35 క్వింటాళ్ల పెసలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. మినుములు 4 కిలోల బ్యాగ్ ధర రూ.560 కాగా రాయితీ పోను రూ.392 కు అందజేస్తున్నట్టు చెప్పారు. పెసలు 4 కిలోల బ్యాగ్ ధర రూ.520 కాగా, రాయితీపోను రైతుకు రూ. 364 కు అందజేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పొలిమేర విజయలక్ష్మి, స్థానిక నాయకులు శ్రీనాడు శ్రీనివాసరావు, పుప్పాల రమేష్ ఏఈవో కె. వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: రైతులకు అవసరమైన మినుములు, పెసల విత్తనాలను రాయితీపై అందిస్తున్నట్టు జోగుంపేట అగ్రికల్చర్ అసిస్టెంట్ సత్యవేణి తెలిపారు. జోగుంపేటలో శుక్రవారం రైతులకు మినుము, పెసల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయితీపై విత్తనాలు పొందాలంటే ముందుగానే ఆర్బీకేలో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుర్ల బాబ్జి, జువ్వల దేముడు, రైతులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి


వి.సంతపాలెంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయినిబాబు


పోస్టర్ విడుదల చేస్తున్న ఏఐఎమ్ నేతలు

కె.కోటపాడు : కార్మిక, ఉద్యోగ, రైతుల సమస్యల పరిష్కారం కోసం అనకాపల్లిలో ఈ నెల 26న నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గండి నాయినిబాబు కోరారు. వి.సంతపాలెం, కె.కోటపాడు గ్రామాల్లో శుక్రవారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రొంగలి

గొలుగొండ: అనకాపల్లిలో ఈనెల 26న జరిగే ధర్నా, ర్యాలీని విజయవంతం చేయాలని ఏఐఎం రాష్ట్ర బ్యూరో సభ్యుడు సర మండ వీరబాబు కోరారు. ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను గొలుగొండలో శుక్రవారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు అందరూ ఉద్యమించాలన్నారు. ఐక్యంగా ఉన్న దళితులను వర్గీకరణ పేరుతో విడదీయడం చాలా బాధాకరమని చెప్పారు. వర్గీకరణ వల్ల అనేక అనర్థాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జువ్వల వరహాలు, అప్పారావు,చిరంజీవి,పొట్ల రాజా, డి.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన వీఆర్‌వోకు సత్కారం


వీఆర్‌వోను సత్కరిస్తున్న గ్రామస్తులు

చీడికాడ: మండలంలోని జేబీపురం సచివాలయం పరిధిలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన వీఆర్‌వో డి.వి.ఎ.శ్రీనివాసరావును గ్రామస్తులు శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు మాట్లాడుతూ శ్రీనివాసరావు విశేషంగా సేలందించి, అందరి మన్ననలు పొందారన్నారు. అనంతరం బదిలీపై ఇక్కడికి వచ్చిన కార్యదర్శి బి.సత్తిబాబును దుశ్శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా అంబలం పూజ


పూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు


అయ్యప్ప అంబలం పూజలో భాగంగా దేవతామూర్తుల వేషధారణ

రోలుగుంట: మండలంలో గల పలు గ్రామాల్లో అయ్యప్ప భక్తులు గురు,శుక్రవారాల్లో అంబలం పూజలను ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి వెలంకాయలపాలెంలో, శుక్రవారం కొండపాలెం కాలనీ, రోలుగుంటలలో ఈ పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరిపారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడలో గురువారం రాత్రి అయ్యప్ప అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సియ్యాద్రి కళ్యాణం ఆధ్వర్యంలో, అప్పలకొండ(దత్తు) గురుస్వామి పర్యవేక్షణలో ఈ పూజ నిర్వహించారు. అంబలం పూజకు చౌడువాడతో పాటు కె.కోటపాడు, ఎ.కోడూరు, కింతాడ, జుత్తాడ, గోవాడ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మాలాధారులు హాజరయ్యారు.

డ్రోన్‌లతో నిఘా


డ్రోన్ ఎగురవేస్తున్న పోలీసులు

నర్సీపట్నం: డ్రోన్‌లతో పట్టణంలో నిఘా పెట్టినట్టు పట్టణ సీఐ జి.గోవిందరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో డ్రోన్ ఎగురవేసి, నిఘా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలైన కొత్తవీధి, ఆర్టీసీ కాంప్లెక్స్, పెదబొడ్డేపల్లిలలో డ్రోన్‌ల సహాయంతో నిఘా కట్టుదిట్టం చేశామన్నారు. నేరచరితుల కదిలికలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు డ్రోన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. ప్రతి నిత్యం డ్రోన్‌ల ద్వారా పోలీసు పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు డ్రోన్ నిఘాను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. మాదకద్రవ్యాల రవాణా, నేరచతలను కదిలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐలు రమేష్, ఉమాశంకరరావు పాల్గొన్నారు.

దుర్గా పోలిపిల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


దుర్గా పోలిపిల్లమ్మను దర్శించుకుంటున్న అయ్యప్ప భక్తులు

మాడుగుల: స్థానిక నవర వీధిలో వెలసిన దుర్గా పోలిపిల్లమ్మ ఆలయంలో కార్తీక శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు, శివ స్వాములు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న ఏడీ ఉమాప్రసాద్

మాకవరపాలెం: యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ ఏడీ ఉమాప్రసాద్ రైతులకు సూచించారు. తామరం రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతులకు కొబ్బరి, ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సాగు, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను వివరించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్ రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో చిరంజీవి, ఈవో శేషునాయుడు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం వన సమారాధన రేపు

చోడవరం: శ్రీ గణేష్ గాయత్రీ బ్రాహ్మణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 24న కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు కందర్ప కృష్ణమూర్తి, , అధ్యక్షుడు పుల్రీవు శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. చోడవరం జగన్న లే ఔట్ సమీపంలో కూరెళ్ల వారి కల్లాల వద్ద ఈ కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. బ్రాహ్మణులంతా ఈ వన సమారాధనను హాజరు కావాలని వారు కోరారు.

పాలు, రొట్టెల పంపిణీ


మాడుగుల ప్రభుత్వాస్పత్రిలో పాలు, రొట్టెలు పంపిణీ చేస్తున్న భక్తులు

మాడుగుల: సత్యసాయి బాబా 99వ జయంతి సందర్భంగా మాడుగుల మోదమాంబ కాలనీలో గల సత్యసాయి మందిరం వద్ద శుక్రవారం ఉచితంగా మొక్కలు, స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు,రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కె.అప్పల నాయుడు, ఎ.రాజశేఖర్, కె.శ్రీనివాసరావు, పుట్టా బలరామ్, కె.రాజుకొండ తదితరులు పాల్గొన్నారు.

రుచీపచీ లేని హాస్టల్ భోజనం

- ముద్ద దిగక అవస్థలు పడుతున్న విద్యార్థులు
- ఐదు నెలలగా అందని బిల్లులు
- సంక్షేమాధికారులకు తలకు మించిన భారం

హాస్టల్ ముద్ద గొంతు దిగడం లేదు. రుచీపచీ లేని భోజనం పెడుతుండడంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. మెనూ సక్రమంగా అమలు కాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. సాయంత్రం వేళల్లో అల్పాహారం పెట్టకపోవడంతో విద్యార్థులు ఆకలితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు

నర్సీపట్నం: ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో విద్యార్థులు అర్ధాకలితో రోజులు వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు పేరుకుపోవడం..నెల నెలా సరకులు కొనుగోలు చేయడం సంక్షేమాధికారులకు తలకుమించిన భారంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బిల్లు మంజూరు కాకపోవడంతో డైట్ చార్జీల బకాయిలు లక్షల్లో పేరుకుపోయాయి. ప్రతినెలా సంక్షేమాధికారులు బిల్లులను అప్‌లోడ్ చేయడమే తప్ప మంజూరు కాకపోవడంతో సరకులు కొనడం వారికి భారంగా పరిణమించింది. పాఠశాల విద్యార్థులకు నెలకు రూ.1400 చొప్పున హాస్టల్ బిల్లులివ్వాలి. సబ్ డివిజన్ పరిధిలో లక్షలకు పైగా రావాల్సి ఉంది. గత ఐదు నెలలు నుంచి బిల్లులు అందక మెనూ అమలుపై ప్రభావం పడింది. నర్సీపట్నం సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సీ వసతిగృహాలు 12 ఉండగా, వీటిలో 1,150 మంది విద్యార్థులు, 11 బీసీ వసతిగృహాల్లో 1500 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. జూన్ నుంచి నేటి వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో వసతిగృహాల సంక్షేమాధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిరణా, కూరగాయలు తదితర నిత్యావసర సరకులకు లక్షల్లో బకాయిలు పేరుకుపోవడంతో వ్యాపారులు సైతం అరువు ఇచ్చేందుకు వెనకాడుతున్నారు. దీంతో సంక్షేమాధికారులు తలలు పట్టుకుంటున్నారు. నిబంధనల ప్రకారం విద్యార్థులకు నిత్యం ఆహారం అందించాలి. వారంలో మూడు రోజులు కచ్చితంగా చికెన్ ఇవ్వాలి. చాలా వసతిగృహాల్లో ఇది అమలు కావడం లేదు. ఉదయం వేళల్లో పాలు ఇవ్వడం లేదు. వారంలో విధిగా ఆరు సార్లు ఇవ్వాల్సిన కోడిగుడ్లను ఎగవేస్తున్నారు. సాయంత్రం వేళల్లో ఆల్పాహారం సక్రమంగా ఇవ్వడం లేదు. నాసిరకం భోజనం తినలేక చాలా చోట్ల విద్యార్థులు అరకొరగా తిని మిగతాది పడేస్తున్నారు. నాసిరకం సరకులతో వంటలు చేస్తుంటడంతో కొన్నిచోట్ల విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు.


భోజనం చేస్తున్న వసతిగృహ విద్యార్థులు

బిల్లుల పెండింగ్ వాస్తవం...

బిల్లులు పెండింగ్ ఉండడం వాస్తవమే. ఐదు నెలల నుంచి డైట్ చార్జీలు రావాల్సి ఉంది. ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసింది, ఈ నెలాఖరు నాటికి బిల్లులు మంజూరు అవుతాయి. బిల్లులు రాకపోయినా సంక్షేమాధికారులు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారు.

– గోపీనాథరావు, బీసీడబ్ల్యూవో, ఏఎస్‌డబ్ల్యూవో, నర్సీపట్నం